ప్రజా సేవకులు వలంటీర్లు

తెనాలిఅర్బన్: ప్రజాశ్రేయస్సే పరమావధిగా భావించి వలంటీర్లు పనిచేస్తున్నారని పలు సంక్షేమ పథకాల లబ్ధిదారులు పేర్కొన్నారు. నిత్యం వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన ప్రతి ప్రభుత్వ పనిని సకాలంలో చేస్తున్నారని, అలాంటి వారిపై రాజకీయ పార్టీ నాయకులు విమర్శలు చేయడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాణాలకు తెగించి సేవ చేశారు.



కోవిడ్ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్ళాలంటే భయంగా ఉండేది. అటువంటి సమయంలో వార్డు వలంటీర్లు మా ఇళ్ళ వద్దకు వచ్చి యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి వైద్య సహాయాన్ని అందించేలా చూశారు. ప్రాణాలను తెగించి వారు చేసిన సేవ మరువరానిది.

– జనకోట రాజ్యలక్ష్మి, ఇంటిస్థల లబ్ధిదారులు, తెనాలి

సంక్షేమ పథకాలను అందించడంలో ముందున్నారు.



వార్డు వలంటీర్లు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, జగనన్న చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాల్లో అర్హులైన వారిని భాగస్వాములు చేయడంలో వలంటీర్లు ముందున్నారు. వారే మా ఇళ్ళకు వచ్చి అవసరమైన ధృవపత్రాలను తీసుకువెళ్ళి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేశారు.

– షేక్ బాజీ, జగనన్న చేయూత లబ్ధిదారులు, తెనాలి

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యాలు తగవు.



చిన్న చిన్న వ్యాపారులు చేసుకుంటూ జీవించే కుటుంబం మాది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాల్లో మా పిల్లలను వలంటీర్లు భాగస్వాములుగా చేశారు. తద్వారా ఆర్థిక భారం తగ్గింది. పేద ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యాలు తగవు.

– పసుపులేటి నాగమల్లేశ్వరి, విద్యాదీవెన లబ్ధిదారులు, తెనాలి

కుటుంబ సభ్యుల చూసుకుంటున్న వలంటీర్లు



గతంలో పింఛన్ కోసం కేంద్రాల వద్ద గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చేది. రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసిన తరువాత వారు వారంలో రెండు రోజులు మా ఇంటికి వచ్చి మా అవసరాలు అడిగి తెలుసుకుంటున్నారు. అంతేకాకుండా ప్రతి నెల మొదటి రోజునే వలంటీర్లు పింఛన్‌ను ఇంటికి తీసుకు వచ్చి పంపిణీ చేస్తున్నారు. వారి సేవలు వెలకట్టలేనివి.

– కోలపూడి రాజ్యలక్ష్మి, వికలాంగ పింఛన్ లబ్ధిదారులు, తెనాలి

వలంటీర్ల సేవలను రాజకీయ నాయకులు గుర్తించారు



ఇటీవల కాలంలో వలంటీర్లపై కొందరూ రాజకీయ నాయకులు అనుచిత వ్యాఖ్యాలు చేయడంతో పాటు పలు ఆరోపణలు చేస్తున్నారు. ప్రజా సేవ చేస్తున్న వలంటీర్ల వ్యవస్థను దిగజార్చే విధంగా విమర్శలు చేయడం బాధకరం. రాజకీయ నాయకులందరూ వారి సేవలను గుర్తించారు.

– మేకల నాగలక్ష్మి, అమ్మ ఒడి లబ్ధిదారులు, తెనాలి.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శివకుమార్



స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

గుడిబండి వారిపాలెం(కొల్లిపర): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతోపాటు అగ్రకులాల్లో ఉన్న పేదలకు కూడా పూర్తి స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం కొల్లిపర పంచాయతీ పరిధిలోనే గ్రామ సచివాలయం 1లో గుడిబండి వారిపాలెంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును ,గ్రామంలో అభివృద్ధి పై స్థానిక సచివాలయం సిబ్బంది, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఏ దేశంలో ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎన్నికల మ్యానిఫెస్టోని లోని ప్రతి హామీని తూచ తప్పకుండా నాలుగు సంవత్సరాల పరిపాలనలో 98 శాతం అమలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ ప్రభుత్వం మాత్రమే అని అన్నారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు అర్హత ఉంది వివిధ సాంకేతిక, ఇతర లోపాల వల్ల ఇంకా రానివారికి తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెటుకుని అనేక ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గ్రామంలో వైఎస్సార్ చేయూత, ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, జగనన్నతోడు, వాహనమిత్ర, ఈబీసీ నేస్తం, అమ్మఒడి వంటి వివిధ సంక్షేమ పథకాలుద్వారా సచివాలయం 1 పరిధిలో 1588 హౌస్ హోల్డ్స్‌లో 4230 జనాభాకు ఈ నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.12,95 కోట్లు, 14, 15వ ఆర్థిక ఫైనాన్స్ ద్వారా అభివృద్ధి కోసం రూ. 4.69 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిపారు. ప్రజలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు ఎటువంటి మధ్యవ్యక్తులు లేకుండా అర్హత ఉంటే నేరుగా సంబంధిత పత్రాన్ని తీసుకుని సచివాలయం వెళ్ళి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే కాలపరిమితి లోపు సంబంధిత సంక్షేమ పథకానికి అర్హత పొంది నేరుగా ఖాతాల్లో జమ కావడం ఎంతో ఆనందరంగా ఉందని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు గుడిబండి చిన్నవెంకటరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి(శివకోటి), పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు కె.శ్రీలత, చిలువూరి ఝాన్సీ, తెనాలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అవుతు సీత, తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ బట్టిప్రోలు వెంకటలక్ష్మి , అవుతు నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో చెత్త సేకరణ వాహనాలు



వాహనాలను పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చెత్తను సేకరించేందుకు కార్పొరేషన్ అధికారులు శుక్రవారం రెండు చెత్త సేకరణ వాహనాలను కొనుగోలు చేశారు. డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే ఆదేశాల మేరకు, కమిషనర్ శారదాదేవి సూచనల మేరకు తాడేపల్లి, మంగళగిరి పట్టణాల్లో చెత్త సేకరణకు రెండు వాహనాలు కొనుగోలు చేశామని, వీటి విలువ సుమారు రూ.80 లక్షలు ఉంటుందని, సోమవారం నుంచి ఈ వాహనాలు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. వాహనాల్లో చెత్త సేకరించి నేరుగా చిలకలూరిపేట వద్ద ఉన్న డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తామని, గతంలో కొనుగోలు చేసిన వాహనాల్లో 10 టన్నులు మాత్రమే చెత్త పడుతుందని, ప్రస్తుతం కొనుగోలు చేసిన వాటిలో 14 టన్నుల వరకు చెత్తను సేకరించ వచ్చని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

సీఎస్ఆర్ నేటి తరం నటులకు ఆదర్శం

తాడేపల్లిరూరల్: రంగస్థల నటుడు చిలకలపూడి సీతారామాంజనేయులు (సీఎస్ఆర్) జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సీఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హాబీ క్లబ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుభాకరరాజు మాట్లాడుతూ సీఎస్ఆర్ నేటి తరం నటీనటులకు ఆదర్శమన్నారు. మాయాబజార్ సినిమాలో శకుని పాత్రతో తెలుగు వారి మనసులను దోచుకున్నారని అన్నారు. పలు పౌరాణిక చిత్రాలలో ఆయా పాత్రలను పోషించి నటనకు వన్నె తెచ్చిన మహానుభావుడని అన్నారు. అభినయ్ క్లబ్ నట శిక్షకులు వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ పాచికలతో పాండవులను అడవులకు పంపిన దృశ్యాన్ని తలచుకోగానే కళ్లముందు కదలాడే వ్యక్తి సీఎస్ఆర్ అని గుర్తు చేశారు. అనంతరం వి.గోపాలకృష్ణమూర్తి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతురమ్య, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఐదో తరగతి విద్యార్థి అదృశ్యం



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని కాజకు చెందిన ఐదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కాజ పుల్లయ్యనగర్‌కు చెందిన షేక్ కరీముల్లా, జరీనా దంపతుల కుమారుడు ఫిరోజ్ (12) ప్రతి రోజూ మాదిరి గురువారం ఉదయం స్కూలుకు వెళ్లి సాయంత్రం ఐదు గంటలకు తిరిగి ఇంటికి వచ్చాడు. స్నేహితులతో కలసి ఆటలాడుకునేందుకు బయటకు వెళ్లిన ఫిరోజ్ తిరిగి ఇంటికి రాలేదు. తల్లి జరీనా తన కుమారుడు ఫిరోజ్ అదృశ్యమైనట్లు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాకంబరిగా ఎన్నాడమ్మ దర్శనం



ఖాజీపాలెం(కర్లపాలెం): శాకంబరీ దేవిగా ఎన్నాడమ్మ శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలోని ఎన్నాడమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా పలు రకాల పండ్లు, కూరగాయలతో శాకంబరి అలంకరణ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి సారె సమర్పించి, పెద్ద సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల మహిళలు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో వరివిత్తనాలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు సబ్సిడీపై అందించనున్నామని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి పి. శిరీష అన్నారు. శుక్రవారం దుగ్గిరాల వ్యవసాయ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానున్న సందర్భంగా వరి పంట వేసుకునే రైతులకు ప్రతి గ్రామంలోనూ ఆర్‌బికె సెంటర్‌లలో వరి విత్తనాలు, ఎరువులు అందుబాటు లో ఉన్నాయని తెలిపారు. వరి పంటతో పాటు గట్లపై నాటుకొనుటకు కంది విత్తనాలు ఉచితంగా అందజేయనున్నామని వివరించారు. కౌలు వ్యవసాయం చేసే ప్రతి రైతుకు సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తామని, రైతులు సమీప ఆర్‌బికె సెంటర్లలో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ వనిత, ఏఏబీ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, దుగ్గిరాల ఏఈఓ ఎ.రమేష్‌బాబు, ఏఏబీ సభ్యులు, పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ నివాస గృహంలో చోరీ

మంగళగిరి: ఏపీ మహిళా కమిషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి నివాస గృహంలో చోరీ జరిగింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి కాజకు చెందిన తోకల హరిబాబు ఏపీ మహిళా కమిషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 10 గంటలకు డ్యూటీకి బయలుదేరి వెళ్లిన హరిబాబు అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా సుమారు 10 గ్రాముల బంగారం, నగదు మాయమైంది. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రేపు చౌడేశ్వరి అమ్మ జయంతి

మంగళగిరి: దేవాంగ కుల దేవత చౌడేశ్వరి అమ్మ వారి జయంతి కార్యక్రమం ఆదివారం ఆషాఢ అమావాస్య సందర్భంగా నిర్వహించనున్నట్లు అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అల్లక తాతారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4గంటలకు నగరంలోని కొప్పురావుకాలనీ నుంచి కలశ బోనాలతో, మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి గండాలపేటలో వేంచేసియున్న తోతాద్రి పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామని, దేవాంగ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రేపు మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారికి ఆదివారం బోనాల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆషాఢ మాసం నాల్గవ ఆదివారాన్ని పురస్కరించుకుని ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని, భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని అమ్మవారి కృపాకటాక్షలు పొందగలరని కోరారు.

క్లుప్తంగా

చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని ర్యాలీ



తెనాలిఅర్బన్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ చిన్నారులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జయహో ఇస్రో, మేరా ఇస్రో మహాన్, మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: శివాజీచౌక్‌లోని శ్రీ కాశీకామాత ఆలయం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి సీతారామయ్య, కార్యదర్శి యర్ర శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రతి నెల రెండో శుక్రవారం దేవాలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నీరంజన్, సుబ్బారావు, రామకృష్ణ, హనుమంత్, వెంకట్రావు, రాజీబాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ



తెనాలిఅర్బన్: హ్యూమానిటీ డెవలెప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నందులపేటలోని సీనియర్ సీటిజన్స్ హాల్‌లో శుక్రవారం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అబ్బాస్ అలీఖాన్, ఇమ్మానే మజ్లిస్ కమిటీ అధ్యక్షుడు ఫరీద్, సలావుద్దీన్, రాఘవేంద్రరావు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

షిరిడి సాయి ఆశ్రమంలో అన్నదానం



తెనాలిటౌన్: గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, రైల్వేస్టేషన్ రోడ్డులోని అనాథలకు శివలింగేశ్వర భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. ఎస్వీయోగ సభ్యులు గలికపర్తి కాశీవిశ్వనాథ్ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయోగ కన్వీనర్, ఎం.రమణయ్య మాట్లాడుతూ యోగ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, భక్త బృందం నిర్వాహకులు కుర్రా శ్రీను, అనూష, శిరీష, సునీత, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడికృత్తిక మహోత్సవ వేడుకలు



తెనాలిటౌన్: రూరల్ మండలం పెదరావూరులో మహా విద్యాపీఠంలో శ్రీ అభయహస్త సుబ్రమణ్యస్వామివారికి ఆడికృత్రిక మహోత్సవంలో భాగంగా స్వామికి విశేష పూజలు జరిపారు. అభిషేకములు నిర్వహించారు. అనంతరం గురు వందనం, మండపూజ, శ్రీలక్ష్మీ గణపతి హోమం, చండీహోమం నిర్వహించారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణేవ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మహావిద్యాపీఠం నిర్వాహకులు సుబ్రమణ్యశర్మ మాట్లాడుతూ ఆడికృత్రిక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం విశేష కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు స్వామివారికి దర్శించుకోవాలని కోరారు. భక్తులు, గ్రామస్థులు, మహావిద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈద్గాకు గ్రావెల్ తోలకం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలిలోని ఈద్గాకు మెరక వేయాలని ముస్లింలు కోరడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే ఈద్గాలో మెరక తోలే పనులు చేపట్టారు. ఇప్పటికే ఈద్గాలో సగానికిపైగా మెరక పూర్తయిందని వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్ తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కేను స్థానిక ముస్లిం సోదరులు అడిగిన వెంటనే ఈ పనులు చేపట్టారని, రెండుమూడు రోజుల్లో ఈ పనులు పూర్తికానున్నట్లు ఆయన తెలిపారు.

కౌలు రైతులు సీసీ కార్డు తీసుకోవాలి



సమావేశంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయాధికారుల

కొల్లిపర: కౌలు రైతులు తప్పని సరిగా ప్రభుత్వం అందిస్తున్న కౌలురైతు గుర్తింపు కార్డు తీసుకోవాలి అప్పుడే ప్రభుత్వం కౌలు రైతులకు అందిస్తున్న పథకాలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి సున్నా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీ ఇవ్వాలని, వ్యవసాయ పనిముట్లు గ్రూపులకు కాకుండా ఇన్‌డివిజువల్‌గా ఇవ్వాలని, ఎటువంటి ఆంక్షలు లేకుండా మండలంలోనే పసుపు కొనుగోలు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు తెలిపిన ప్రతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏడిఏ ఉషారాణి, ఏఓ కె.వెంకటరావు, తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీఓ చంద్రమోహన్, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి



మాజీ ఎంఈఓ లక్ష్మినారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొల్లిపర: ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసినప్పుడే పాఠశాలకు మంచి పేరు వస్తోందని తద్వారా ఉపాధ్యాయులతోపాటు మండలానికి , ఎంఈఓలను కూడా మంచి పేరు వస్తోందని ఆ దిశగా ప్రతి ఒక్కరు పనిచేయాలని మండల విద్యాశాఖాధికారి 1 సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో నూతనంగా ఎంఈఓలుగా విధుల్లో చేరిన వారికి సత్కారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఈఓ లక్ష్మీనారాయణ పాల్గొని ఉపాధ్యాయలకు పలుసూచనలు సలహాలు అందజేశారు. అనంతరం నూతన ఎంఈఓ1 సాల్మన్‌రాజు, ఎంఈఓ 2 ఝాన్సీలత కలిసి మాజీ ఎంఈఓ లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో 2 ఝాన్సీలత మాట్లాడుతూ విద్యార్థులకు కనీస అభ్యస్థాయి ఉండేలా టీచర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎం,రమేష్ , సీఆర్‌పిలు రమేష్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మౌలిక వసతులు ఏర్పాటు చేయండి

ఎంఈఓ జయంతిబాబు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేట్ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన చేయాలని మండల విద్యాధికారి-2 జయంతిబాబు సూచించారు. తెనాలి పట్టణంలోని ఎస్ఆర్ఐ, నవోదయ స్కూల్, జెఎంజె గ్లోబల్ స్కూల్, తదితర స్కూల్స్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన సమయాల్లో పాఠశాలలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు మేయిటెన్స్ సరిగ్గా ఉండాలన్నారు. ఆయన పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి పండితుల ఆశీర్వచనం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి వేద ఆశీర్వాదం పలుకుతున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు వరాల జల్లు కురిపించడంతో ఆయన చిత్రపటానికి ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం సీతాభవనంలో శుక్రవారం అర్చకులు సమావేశం నిర్వహించారు. పలువురు అర్చకులు మాట్లాడుతూ అర్చకులకు వంశపారంపర్యం హక్కులు కల్పించి జీతాలు పెంచి అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి కానీ అర్చకులను, వారి బాధలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. గతంలో పలు ఆలయాలు ధూప, దీప, నైవేద్యాలకు నోచుకోలేదని, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16 వేల దేవాలయాల్లో దూప, దీప నైవేద్యాలు ఏర్పాటు చేసేందుకు 16 వేల మంది అర్చకులను ఏర్పాటు చేశారని, నిధులు కేటాయించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు పెద్దపీట వేశారని, జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క బ్రాహ్మణ వర్గానికే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్, నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు కె.రాఘవాచార్యులు, రాజరాజేశ్వరి దేవస్థానం అర్చకులు కె.రాధాకృష్ణ మూర్తి, సీతానగరం శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానం అర్చకులు శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల నుంచి ప్రాణహాని

ప్రాణ రక్షణ కల్పించాలని దంపతుల వేడుకోలు

మంగళగిరి: తమకు కొందరు మందుబాబుల నుంచి ప్రాణ హాని ఉందని, ప్రాణ రక్షణ కల్పించాలని ఓ బాధిత కుటుంబం మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు...బాపట్ల జిల్లా కొండభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన పసుమర్తి వెంకటేశ్వరరావు, రత్నకుమారి దంపతులు బతుకుదెరువు నిమిత్తం కొన్నేళ్లుగా యర్రబాలెం దళితవాడలో నివసిస్తున్నారు. వెంకటేశ్వరరావు తాపీ కార్మికునిగా పనిచేస్తుండగా భార్య కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 9న సాయంత్రం 6.30 సమయంలో వెంకటేశ్వరరావు నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా క్రైస్తవ శ్మశానవాటిక వద్ద మద్యం, గంజాయి సేవిస్తున్న కొందరు యువకులు మత్తులో ఆయనపై రాళ్లు విసిరి గాయపర్చారు. అదే ప్రాంతానికి చెందిన దొడ్డా ప్రదీప్‌తోపాటు మరో గుర్తు తెలియని యువకుడు వారి ఇంటి వద్దకు వచ్చి మరోమారు భార్యాభర్తలపై దాడికి పాల్పడటమే కాకుండా చంపేస్తామని బెదిరించి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి బాధితులు మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు దొడ్డా ప్రదీప్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తమపై దాడికి పాల్పడి గాయపర్చడమే కాకుండా చంపేస్తానంటూ బెదిరించిన ప్రదీప్‌ను రూరల్ పోలీసులు విచారించకుండానే మొక్కుబడిగా కేసు నమోదు చేసి గంటల వ్యవధిలోనే వదిలివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ సమాధుల వద్ద ప్రతి రోజూ కొందరు యువకులు మద్యంతోపాటు గంజాయి కూడా సేవిస్తున్నారని, గంజాయి మత్తులోనే ప్రదీప్ తమపై దాడి చేసి గాయపర్చినా రూరల్ పోలీసులు పెట్టీ కేసు నమోదు చేసి పంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు మంగళగిరి రూరల్ పోలీసులు న్యాయం చేయాలన్నారు.

అభివృద్ధి పనుల్లో డ్వాక్రా సంఘాలు భాగస్వాములు కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ సీహెచ్ విద్యాసాగర్

చెరుకుపల్లి: గ్రామాల్లో జల జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో డ్వాక్రా సంఘాల మహిళలు భాగస్వాములై కాంట్రాక్టు పనులు చేసుకోవచ్చని బాపట్ల జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. నడింపల్లి గ్రామంలో జలజీవన్ పథకం ద్వారా జరిగే మంచి నీటి ట్యాంకు, పైప్‌లైన్ తదితర అభివృద్ధి పనులపై శుక్రవారం డ్వాక్రా సంఘ మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసాగర్ మాట్లాడారు. డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా మరింత స్థిరపడేందుకు ఇటువంటి పనులు ఎంతగానో దోహదపడతాయన్నారు, అనంతరం డ్వాక్రా సంఘల మహిళల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏవీఎల్ ప్రసాద్, ఏఈ జి.అనూష, జలజీవన్ జిల్లా మేనేజర్ పి.కిరణ్‌కుమార్, ఏపీఎం వెంకటేశ్వర్లు, డ్వాక్రా సంఘ జిల్లా అధ్యక్షురాలు ద్రాక్షవలి పాల్గొన్నారు.